
ఎడిటోరియల్ డైరెక్టర్: విద్యాసాగర్ కాసోజు, సాగర్ బిజిలి
www.vasthavadarpanam.com

# వాస్తవ దర్పణం

తెలుగు దిన పత్రిక
ఎడిటర్: మహమ్మద్ జక్రియా
ఆదివారం 31.05.2026
https://epaper.vasthavadarpanam.com

జిల్లాల వారీగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.
WANTED
తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వాస్తవ దర్పణం దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లును ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.
93 91 92 61 19



## మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం

### ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ తప్పుకుంటుందా?

- బీఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే 'రైతు డిస్కం'
- రైతుల ముసుగులో రాజకీయ లబ్ధీ కోసం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు
- కేసీఆర్ మీద ఒట్టేసి తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్ చెప్పాలి
- బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయనటంలో అనుమానమే లేదు
- మహేశ్‌కుమార్, తనది విజయవంతమైన కాంబినేషన్:సీఎం

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మే 30:** మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా? అని సీఎం ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని, ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నామని అన్నారు. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందని,

మిగతా 2



## మైనింగ్ అక్రమాలపై సీఐడీ విచారణ

- బీఆర్ఎస్‌హయాంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు
- మైనింగ్ మాఫియా, క్రషింగ్ యూనిట్ల దందాపై సమగ్ర విచారణ
- నిబంధనలకు విరుద్ధంగా 30కి పైగా క్రషింగ్ యూనిట్లు
- ఎలాంటి అనుమతులు లేకుండానే నడిచాయని గుర్తించిన అధికారులు
- గనుల శాఖ నివేదిక ఆధారంగా నిర్ణయం
- ఆరు బడా గ్రానైట్ సంస్థలు, ఓఆర్ఆర్ సమీపంలోని క్రషింగ్ యూనిట్ల నిర్వాహకులపై కేసు నమోదు
- ఖజానాకు రూ. వందల కోట్ల గండి

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మే 30 :** రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ. వందల కోట్ల మేర గండికొడుతూ, నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా సాగించిన మైనింగ్ మాఫియా, క్రషింగ్ యూనిట్ల దందాపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గనుల శాఖ ఇచ్చిన నివేదికను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం..ఈ కుంభకోణంపై విచారణను సీఐడీకి అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు, అక్రమాలకు పాల్పడిన ఆరు బడా గ్రానైట్ సంస్థలతో పాటు ఓఆర్ఆర్ సమీపంలోని క్రషింగ్ యూనిట్ల నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

**2014 నుంచి జరిగిన అక్రమాలపై విచారణ**

గత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో జరిగిన అక్రమ మైనింగ్, అనుమతుల్లేని క్రషింగ్ యూనిట్ల నిర్వహణపై తీవ్ర స్థాయి వాదోపవాదాలు జరిగిన నేపథ్యంలో..2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల అక్రమాలపై విచారణకు ఆదేశిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించిన ప్రభుత్వం.. దర్యాప్తునకు అవసరమైన పూర్తి వివరాలను సీఐడీకి పంపాలని మైనింగ్ శాఖను ఆదేశించింది. ఈ మేరకు మైనింగ్, విజిలెన్స్ విభాగాలు సంయుక్తంగా జరిపిన అంతర్గత విచారణలో మైనింగ్ మాఫియా బాగోతం బట్టబయలైంది. కరీంనగర్, పెద్దపల్లి,

మిగతా 2



## మేం అధికారంలోకి వచ్చాక 111 జీవో ఎత్తివేస్తాం

- గుంపు మేస్త్రీ పై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- హక్కుల పరిరక్షణకే కొత్త పార్టీ
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- మొయినాబాద్లో టీఆర్ఎస్ జెండా పండుగ

వాస్తవదర్పణం, మొయినాబాద్

**మే 30:** తమ పార్టీ అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ జీవో కారణంగా బాధపడుతున్న వారందరికీ ఉపశమనం కలిగిస్తామన్నారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్ లో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొయినాబాద్ లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ లక్ష్యాల కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలను గత 12 ఏళ్లలో సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను పరిరక్షించుకునేందుకే టీఆర్ఎస్ ఏర్పాటు చేశామన్నారు.

**111 జీవో ఎత్తివేస్తాం**

111 జీవో పరిధిలోని బాధితులందరికీ టీఆర్ఎస్

మిగతా 2



## జవాబుదారీతనం, పారదర్శకత పెరగాలి

- సామాజిక పరిస్థితులు, సరికొత్త సవాళ్లకు అనుగుణంగా మారాలి
- త్వరలోనే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో
- రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావం దాదాపుగా కనుమరుగైంది
- ఇకపై డ్రగ్స్, సైబర్ నేరాలపై నిఘా
- పోలీసు ఉన్నతాధికారులకు డీజీపీ దిశానిర్దేశం

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మే 30:** రాష్ట్ర పోలీస్ శాఖలో జవాబుదారీతనం, పారదర్శకత, నెలకొల్పడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని తీరులో మార్పు రావాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆకాంక్షించారు. మారుతున్న సామాజిక పరిస్థితులు, సరికొత్త సవాళ్లకు అనుగుణంగా ఆ మార్పు ఉండాలన్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, కమాండెంట్లు, డీఎస్పీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. గడిచిన మూడు దశాబ్దాలుగా నక్సలిజం అణచివేతపైనే రాష్ట్ర పోలీస్ ప్రధానంగా దృష్టి సారించిందని డీజీపీ గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా నక్సల్స్ ప్రభావం దాదాపుగా కనుమరుగైనందున.. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐడి వంటి ప్రత్యేక విభాగాల ప్రాధాన్యతను

మిగతా 2

## మూసీ బాధితులకు ఊరట

- ఇండ్ల నష్టం తగ్గించేలా ప్రాజెక్టులో మార్పులు
- గండిపేట్, రాజేంద్రనగర్ మండలాల్లో బాధితుల ఆందోళన
- పాత ప్రణాళికల్లో తగిన మార్పులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- బఫర్ జోన్‌లోనే ల్యాండ్ స్కేపింగ్

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మే 30:** హైదరాబాద్ రూపురేఖలను మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టులో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే గండిపేట్, రాజేంద్రనగర్ మండలాల్లోని పలు ప్రాంతాల్లోని వందలాది ఇండ్లను కూల్చివేయాల్సి వస్తోందని బాధితులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ప్రజా ప్రయోజనాలను, బాధితుల గోడును ఆలకించిన ప్రభుత్వం ప్రస్తుతానికి ఇండ్ల నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జనావాసాలు, ఇండ్లు ఉన్న ప్రాంతాల్లో భారీ గ్రీనరీ, ఇతర వినోద కార్యక్రమాలకు సంబంధించిన పాత ప్రణాళికల్లో తగిన మార్పులు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పునరుజ్జీవన ప్రక్రియలో భాగంగా అసలు మూసీ రివర్ ఖచ్చితమైన హద్దులను తేల్చడం అత్యంత

మిగతా 2





## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

- సింగరేణిపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో చర్యలు
- తెలంగాణ భవన్ దగ్గర హైడ్రామా
- ప్రశ్నిస్తున్నందుకే ఈ కుట్ర:బాల్క సుమన్

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మే 30**: రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక మలుపు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో తెలంగాణ భవన్ కేంద్రంగా హైడ్రామా సాగింది. తీవ్ర ఉద్రిక్తత మధ్య ఆయన్ని నాంపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సింగరేణిని తగలబెట్టాలని, మిలిటెంట్ యాక్టివిటీ చేయాలని చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఆయనపై పలు స్టేషన్స్‌లో కేసులు నమోదు

మిగతా 2



## రేవంత్ ఒక 'రెన్యూవల్ సీఎం'

- కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం .. 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుంది
- జీవో-17 రద్దు వరకు పోరాటం కొనసాగిస్తాం
- చిన్న కాంట్రాక్టర్లకు జరిగిన అన్యాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వార్త 2

# మూసీ బాధితులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

అవసరమని ప్రభుత్వం గుర్తించింది. నదికి సంబంధించిన సరిహద్దు రాళ్లను పాతితే తప్ప ఎక్కడ ఆక్రమణలు జరిగాయో, ఎక్కడ బఫర్ జోన్ ఉందో స్పష్టత రాదని అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలో గండిపేట్ నుంచి గౌరెల్లి వరకు ఉన్న 55 కిలోమీటర్ల సుదీర్ఘ మార్గంలో నది హద్దులను గుర్తించి రాళ్లను పాతే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీని బాధితులు కలిసి తమ విన్నపాలను అందజేయడంతో ప్రభుత్వం ఈ సర్వే ప్రక్రియకు ప్రాధాన్యత ఇచ్చింది. ప్రస్తుతం రెవెన్యూ విభాగం, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారు. 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇప్పటివరకు 8 కిలోమీటర్ల మేర హద్దురాళ్లను ఏర్పాటు చేయడం పూర్తయిందని అధికారులు వెల్లడించారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో మొదటి దశలో భాగంగా 21 కిలోమీటర్ల మేర పనులను చేపట్టనున్నారు. ఈ పనుల కోసం భూసేకరణ ఖర్చు కాకుండానే కేవలం నిర్మాణాల కోసమే దాదాపు రూ.6500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి దశ పరిధిలోకి వచ్చే ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్ల మార్గాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ పరిధిలోనే ఉన్న మధు రిడ్జ్ అపార్ట్‌మెంట్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ లాంటి ప్రతిష్టాత్మక నిర్మాణాలకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేయడం కలకలం రేపింది.

**బఫర్ ఏరియాలో అర్బన్ ల్యాండ్ స్కేపింగ్**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. మూసీ నదికి గుర్తించిన అధికారిక సరిహద్దు రాళ్ల నుంచి ఇరువైపులా 50 మీటర్ల వరకు ఉన్న ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా పరిగణిస్తారు. ఈ 50 మీటర్ల బఫర్ ఏరియాలో నది జీవావరణాన్ని కాపాడటం, అర్బన్ ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మూసీ నదిని మురుగు నీరు లేకుండా శుద్ధీకరించడంతో పాటు, ఇరువైపులా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పర్యాటక కేంద్రాలు, అందమైన ఉద్యానవనాలు, మౌలిక సదుపాయాలను కల్పించడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం.

**బఫర్ జోన్ పై మేధోమథనం..**

అయితే.. ఈ 50 మీటర్ల కఠినమైన బఫర్ జోన్ పరిధిని అలాగే కొనసాగిస్తే మధురిడ్జ్ లాంటి పదుల సంఖ్యలో ఉన్న భారీ అపార్ట్‌మెంట్స్, వందలాది ఇండ్లకు భారీగా నష్టం జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మానవీయ కోణాన్ని పరిశీలించిన మంత్రుల సబ్ కమిటీ ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించింది. జనావాసాలు ఉన్న చోట ఈ 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిని కొంత మేర తగ్గించాలా? లేదా బఫర్ జోన్‌లో చేపట్టాలనుకున్న ల్యాండ్ స్కేపింగ్, రిక్రియేషన్ సెంటర్ల విస్తీర్ణాన్ని తగ్గించుకుని ఇండ్లను కాపాడాలా? అనే అంశాలపై తీవ్రంగా మేధోమథనం జరుగుతోంది. హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాత, నష్టం తక్కువగా ఉండేలా తుది డిజైన్లను ఖరారు చేస్తామని అధికారులు చెబుతున్నారు

# మైనింగ్ అక్రమాలపై సీఐడీ విచారణ

**మొదటిపేజీ తరువాయి**

గంగాధర, రాఘవపురం, ఉప్పల్, జగిత్యాల, నాగర్‌కర్నూల్, ఖమ్మం ప్రాంతాల్లో భారీగా అక్రమ మైనింగ్ జరిగినట్లు విజిలెన్స్ నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ మేరకు సీఐడీ దర్యాప్తు కోసం సమగ్ర వివరాలను, ఫైళ్లను అప్పగించింది.

**ఖజానాకు భారీ నష్టం..**

కరీంనగర్‌కు చెందిన కొన్ని బడా సంస్థలు పర్మిట్ లేకుండా ఏకంగా 7,68,889 క్యూబిక్ మీటర్ల కలర్ గ్రానైట్ బ్లాకులను కాకినాడ పోర్టుకు తరలించి, అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేశాయని నివేదికలో స్పష్టం చేశారు. రవాణా చేసిన దాన్ని రికార్డుల్లో తక్కువగా చూపించడం వల్ల ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందని తేల్చారు. ఈ విధంగా మొత్తం ఎనిమిది సంస్థలు కలిసి రూ.124.94 కోట్ల మేర సీనరేజి ఫీజును ఎగ్గొట్టాయని, దానికి 5 రెట్లు పెనాల్టీ వేస్తే, ఈ సంస్థల నుంచి ప్రభుత్వానికి ఏకంగా రూ.749.66 కోట్లు వసూలు కావాల్సి ఉందని సీఐడీకి ఇచ్చిన నివేదికలో మైనింగ్ శాఖ స్పష్టం చేసింది. డిమాండ్ నోటీసులు ఇచ్చినా ఇప్పటివరకు కోట్ల రూపాయల రాయల్టీ చెల్లించని సంస్థలపై, తప్పుడు పత్రాలతో రవాణా చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

**ఇష్టారాజ్యంగా క్రషింగ్..**

మరోవైపు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల 2020 నుంచి 2024 మధ్య కాలంలో ఏకంగా 30కి పైగా క్రషింగ్ యూనిట్లు నిబంధనలకు విరుద్ధంగా నడిచాయని అధికారులు గుర్తించారు. వీటిలో ఎక్కువ భాగం మైనింగ్ లేదా కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా నడిచాయని తేల్చారు. ఆ తర్వాత అధికారుల తనిఖీల్లో 20కి పైగా యూనిట్లను ధ్వంసం చేశామని, అయినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని సీఐడీకి నివేదించారు. వీటికి తోడు నేరెళ్ల రాజన్న సిరిసిల్ల శాండ్ మైనింగ్ కేసు, అక్రమంగా లీజులు బదిలీ చేయడం, లీజు పరిధిని దాటి తవ్వకాలు జరపడం తదితర ఫిర్యాదులన్నింటినీ సీఐడీ దర్యాప్తునకు అప్పగించారు. 2022లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమన్లు, అప్పట్లో కరీంనగర్ మైనింగ్ ఏడీ ఈడీకి ఇచ్చిన స్టేట్‌మెంట్ వివరాలను కూడా జతచేశారు.

**అక్రమ తవ్వకాలపై సీఐడీ దర్యాప్తు**

ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి నివేదిక అందడంతో సీఐడీ దర్యాప్తు అధికారులు దాడులకు సన్నద్ధమవుతున్నారు. అప్పట్లో ఈ లీజులు మంజూరు చేసిన గనుల శాఖ ఉన్నతాధికారులు, అక్రమాలకు పాల్పడిన మైనింగ్ కంపెనీల యజమానులు, క్రషింగ్ యూనిట్ల నిర్వాహకులకు త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగిన ఈ అక్రమ తవ్వకాల వెనుక వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. అప్పటి ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే, వారి అండదండలతోనే ఈ దందా సాగిందన్న ఆరోపణలు ఉన్నాయి. సీఐడీ దర్యాప్తులో ఇంకెన్ని విషయాలు, ఎంతమంది బడా నేతల, మాజీ అధికారుల పేర్లు వెలుగులోకి వస్తాయోనన్న దానిపై రాష్ట్ర రాజకీయాల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# మూసీ బాధితులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

వీలైనంత వరకు తగ్గించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జనావాసాలు, ఇండ్లు ఉన్న ప్రాంతాల్లో భారీ గ్రీనరీ, ఇతర వినోద కార్యక్రమాలకు సంబంధించిన పాత ప్రణాళికల్లో తగిన మార్పులు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పునరుజ్జీవన ప్రక్రియలో భాగంగా అసలు మూసీ రివర్ ఖచ్చితమైన హద్దులను తేల్చడం అత్యంత అవసరమని ప్రభుత్వం గుర్తించింది. నదికి సంబంధించిన సరిహద్దు రాళ్లను పాతితే తప్ప ఎక్కడ ఆక్రమణలు జరిగాయో, ఎక్కడ బఫర్ జోన్ ఉందో స్పష్టత రాదని అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలో గండిపేట్ నుంచి గౌరెల్లి వరకు ఉన్న 55 కిలోమీటర్ల సుదీర్ఘ మార్గంలో నది హద్దులను గుర్తించి రాళ్లను పాతే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీని బాధితులు కలిసి తమ విన్నపాలను అందజేయడంతో ప్రభుత్వం ఈ సర్వే ప్రక్రియకు ప్రాధాన్యత ఇచ్చింది. ప్రస్తుతం రెవెన్యూ విభాగం, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారు. 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇప్పటివరకు 8 కిలోమీటర్ల మేర హద్దురాళ్లను ఏర్పాటు చేయడం పూర్తయిందని అధికారులు వెల్లడించారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో మొదటి దశలో భాగంగా 21 కిలోమీటర్ల మేర పనులను చేపట్టనున్నారు. ఈ పనుల కోసం భూసేకరణ ఖర్చు కాకుండానే కేవలం నిర్మాణాల కోసమే దాదాపు రూ.6500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి దశ పరిధిలోకి వచ్చే ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్ల మార్గాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ పరిధిలోనే ఉన్న మధు రిడ్జ్ అపార్ట్‌మెంట్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ లాంటి ప్రతిష్టాత్మక నిర్మాణాలకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేయడం కలకలం రేపింది.

**బఫర్ ఏరియాలో అర్బన్ ల్యాండ్ స్కేపింగ్**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. మూసీ నదికి గుర్తించిన అధికారిక సరిహద్దు రాళ్ల నుంచి ఇరువైపులా 50 మీటర్ల వరకు ఉన్న ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా పరిగణిస్తారు. ఈ 50 మీటర్ల బఫర్ ఏరియాలో నది జీవావరణాన్ని కాపాడటం, అర్బన్ ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మూసీ నదిని మురుగు నీరు లేకుండా శుద్ధీకరించడంతో పాటు, ఇరువైపులా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పర్యాటక కేంద్రాలు, అందమైన ఉద్యానవనాలు, మౌలిక సదుపాయాలను కల్పించడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం.

**బఫర్ జోన్ పై మేధోమథనం..**

అయితే.. ఈ 50 మీటర్ల కఠినమైన బఫర్ జోన్ పరిధిని అలాగే కొనసాగిస్తే మధురిడ్జ్ లాంటి పదుల సంఖ్యలో ఉన్న భారీ అపార్ట్‌మెంట్స్, వందలాది ఇండ్లకు భారీగా నష్టం జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మానవీయ కోణాన్ని పరిశీలించిన మంత్రుల సబ్ కమిటీ ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించింది. జనావాసాలు ఉన్న చోట ఈ 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిని కొంత మేర తగ్గించాలా? లేదా బఫర్ జోన్‌లో చేపట్టాలనుకున్న ల్యాండ్ స్కేపింగ్, రిక్రియేషన్ సెంటర్ల విస్తీర్ణాన్ని తగ్గించుకుని ఇండ్లను కాపాడాలా? అనే అంశాలపై తీవ్రంగా మేధోమథనం జరుగుతోంది. హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాత, నష్టం తక్కువగా ఉండేలా తుది డిజైన్లను ఖరారు చేస్తామని అధికారులు చెబుతున్నారు

# మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం

**మొదటిపేజీ తరువాయి**

దేశంలోనే మొదటిసారిగా ఎక్కడాలేని విధంగా రైతు డిస్కం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**అప్పుల గురించి హరీశ్ ఎందుకు చెప్పడం లేదు?**

తాము ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. మాజీ మంత్రి హరీశ్‌రావు తాము తీరుస్తున్న అప్పుల గురించి ఎందుకు చెప్పడం లేదన్నారు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పామని అన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదని తెలిపారు. కేసీఆర్ మీద ఒట్టేసి తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలని కోరారు. గతంలోనూ హరీశ్‌రావు వైఎస్ఆర్ దగ్గరికి వెళ్లారని రేవంత్ ఆరోపించారు. హరీశ్‌రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసునని కానీ తాను చెప్పనని స్పష్టం చేశారు. పార్టీ మీటింగ్ వదిలేసి హరీశ్‌రావు ఢిల్లీకి ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయనటంలో అనుమానమే లేదని ముఖ్యమంత్రి చెప్పారు.

**సీబీఐ దర్యాప్తు ఎందుకు జరగట్లేదో కిషన్‌రెడ్డి చెప్పాలి**

ప్రాథమిక ఆధారాలతో 2 కేసులు సీబీఐకి ఇచ్చామని, సీబీఐ దర్యాప్తు ఇంకా ఎందుకు జరగట్లేదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, తనది విజయవంతమైన కాంబినేషన్ అన్న రేవంత్‌రెడ్డి.. తమ ఇద్దరి నేతృత్వంలో అన్ని ఎన్నికలు గెలిచామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్‌గౌడ్‌కు మంచి పదవి రావొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ**

జవాబుపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం ఆరోపించారు. తెలంగాణలో 32 శాతం ధాన్యం మాత్రమే కేంద్రం కొంటోందని రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలను పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్తున్నారని, ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదో చెప్పాలన్నారు.

**ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధి లేనితనం**

పోలవరం కోసం 7 మండలాలు ఇచ్చిన మోదీ.. తెలంగాణ కోసం తిరిగి ఇప్పించలేరా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేని తనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టలేదా? కమ్మ సంఘానికి కేసీఆర్ 10 ఎకరాలు ఇవ్వలేదా? అంటూ ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే తానేనని ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రలో తెలంగాణ వాళ్ల విగ్రహాల గురించి ఏపీలో పార్టీ పెట్టిన కేసీఆర్‌ను అడగాలని సూచించారు. కేటీఆర్.. తారకరామారావు పేరు ఎందుకు మార్చుకోవడం లేదని నిలదీశారు. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవట్లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రేవంత్ ఒక 'రెన్యూవల్ సీఎం'

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో**

**హైదరాబాద్, మే 30:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం 'రెన్యూవల్ సీఎం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇందిరాపార్క్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన జీవో17ను వెంటనే రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంట్రాక్టుల్లో 72 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంట్రాక్టులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయని, చిన్న కాంట్రాక్టర్లకు దక్కాల్సిన అవకాశాలు దూరమవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అప్పులు, చిన్న కాంట్రాక్టర్లకు కేటాయించిన నిధులు, టెండర్ల వివరాలపై శ్వేతపత్రం విడుదల




చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌కు నెలనెలా కప్పం (డబ్బులు) పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసుకుంటూ పోయినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణా బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్ రెడ్డితో పాటు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేని కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సంపద సృష్టించి పేదలకు పంచే విధానాన్ని అమలు చేశారని, గురుకులాలు, కాళేశ్వరం, రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా బడుగు బలహీన వర్గాలకు మేలు జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్న కేటీఆర్, "ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు" అని వ్యాఖ్యానించారు. 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, బడులగు బలహీన వర్గాలకు చెందిన 50 వేల మంది యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

**చిన్న కాంట్రాక్టర్లకి ఇచ్చిన నిధులు, టెండర్లపై శ్వేతపత్రం కోసం డిమాండ్**

ఇవాళ రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బామ్మర్దికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సొంత నియోజకవర్గం కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం వాళ్ల బంధువులకే కాకుండా, బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు, చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

అయ్యాయి. సింగరేణి బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు ఆయన అరెస్టుకు దారి తీశాయి. సింగరేణిని తగులబెట్టండి... మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. డబ్బులు కావాలంటే ఆఫీస్‌లను తగలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కామెంట్స్‌పై ఆనంద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 326(g), 351(3), 353(1)(b), r/w 61(2)(a), BNS4 PDPPA వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మిలిటెంట్ వ్యాఖ్యలు చేసిన తర్వాత ఆయన అరెస్టు ఖాయమని ప్రచారం జరిగింది. దీంతో బాల్క సుమన్ గత మూడు రోజులుగా తెలంగాణ భవన్‌నే తన ఆవాసంగా మార్చుకున్నారు. ఆయన బయటకు రాగానే అరెస్టు చేయాలని పోలీసులు వ్యూహం రచించారు. భవన్ వెలుపల భారీగా పోలీసులు మోహరించారు. లోపల బీఆర్ఎస్ కార్యకర్తలు, లాయర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీస్ గో బ్యాక్ అంటూ కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రశ్నించగా, నాన్‌బెయిల్‌బుల్ కేసులు కాబట్టి నోటీసులు అవసరం లేదని పోలీసులు చెబుతున్నారు.

**ప్రశ్నిస్తున్నందుకే ఈ కుట్ర:బాల్క సుమన్**

అరెస్టుకు కొద్ది నిమిషాల ముందు బాల్క సుమన్ మీడియా ముందు తన గళాన్ని గట్టిగానే వినిపించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను, సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలను ప్రశ్నిస్తున్నందుకు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కిపైగా కేసులు ఉన్నాయని, జైలుకు వెళ్లడం తనకు కొత్త కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి కుట్రపూరితంగా తనను జైలుకు పంపి పైశాచికానందం పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల స్కాములు జరుగుతున్నాయని, వారసత్వ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆయన దుయ్యబట్టారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అత్యంత కఠినమైనవి. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి ప్రేరేపించడం వంటి సెక్షన్ల వల్ల పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందని సమాచారం. బీఆర్ఎస్ లాయర్లు మాత్రం ఇవన్నీ అక్రమ కేసులని, బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలు గురించి తాము గట్టిగా నిలదీస్తుంటే.. ఓర్చుకోలేని ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలు గురించి తాము గట్టిగా నిలదీస్తుంటే.. ఓర్చుకోలేని ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపిస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కేయాలని కాంగ్రెస్ చూస్తోందని ధ్వజమెత్తారు. నాడు తెలంగాణ రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్ శక్తులే.. నేడు మళ్లీ అధికారంలోకి వచ్చి తనను మానసికంగా, రాజకీయంగా వేధిస్తున్నాయని ఆరోపించారు.

# మేం అధికారంలోకి వచ్చాక 111 జీవో ఎత్తివేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

చీఫ్ కల్వకుంట్ల కవిత గుడ్ న్యూస్ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ జీవోను ఎత్తివేస్తామన్నారు. ఇతర పార్టీల మాదిరిగా తాము మోసం చేయమని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ లు ఇక్కడి ప్రజలకు 111 జీవో ఎత్తేస్తామంటూ మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాయని విమర్శించారు. 111 జీవో పరిధిలో ఉన్న 120 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుట్టు పక్కల భూములు ఎకరాకు వంద కోట్లకు పైగా ధర పలుకుతుంటే 111 జీవో పరిధిలోని ప్రజలు మాత్రం తమ భూములను ఎక్కువ రేటుకు అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం భూమి అమ్మితే సమస్యలు తీరుతాయని భావించినప్పటికీ ఈ జీవో అడ్డంకిగా ఉందన్నారు. గుంపు మేస్త్రీ తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే తెలుసని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ వ్యాపారాన్ని ఊడగొట్టారని మండిపడ్డారు. చేవెళ్ల, మొయినాబాద్ లో ఎక్కువగా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారని వారికి మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఏమీ చేయటం లేదని మండిపడ్డారు. అందుకే గుంపుమేస్త్రీ పై పోరాటానికి ఈ ప్రాంత ప్రజలంతా ముందుకు రావాలని కోరారు.





**హక్కుల పరిరక్షణకే కొత్త పార్టీ**

తెలంగాణ వచ్చాక అన్ని సమస్యలు తీరుతాయని భావిస్తే అలా జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యాల కోసం రాష్ట్రం సాధించుకున్నామో ఆ లక్ష్యాలతో పాటు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా మీకు ఏం కావాలో నాకు తెలుసు. తప్పకుండా మన పార్టీ ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నా అన్నారు. అదే విధంగా యువత కోసం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సృజనాత్మక ఆలోచన కలిగిన యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ నుంచి మైనార్టీలు పెద్ద ఎత్తున చేరటంతో ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడిందని చెప్పారు. ఇక్కడి గంగా జమున తెహజీబ్ ను చెడగొట్టే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరముందని కవిత అన్నారు.

**చిలుకూరు బాలాజీ స్వామి వారి దర్శనం**

అంతకుముందు కవిత చిలుకూరు బాలాజీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజాలు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన తమ పార్టీకి స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చామని చెప్పారు. బాలాజీ ఆశీస్సులతో తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతులకు మంచి చేసే బుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాలని స్వామి వారిని కోరుకున్నానని కవిత చెప్పారు. జెండా పండుగ కార్యక్రమం అనంతరం మొయినాబాద్ మండలం సౌరంగల్ లో టీఆర్ఎస్ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బస్ షెల్టర్ కు శంకుస్థాపన చేశారు.

# ఇతర రాష్ట్రాలకు అక్రమంగా సన్నబియ్యం

- ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రణాళిక లేదు
- బీజేపీ యాత్ర చేసే వరకూ ప్రభుత్వం స్పందించలేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపణలు



**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మే 30:** తెలంగాణలో పండే నాణ్యమైన సన్న బియ్యం ఇతర రాష్ట్రాలకు అక్రమంగా అమ్ముకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం వద్ద సరైన ప్రణాళిక లేదన్న ఆయన.. ప్రభుత్వం దృష్టంతా కమీషన్లు, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ పై ఉందని ఆరోపించారు. బీజేపీ యాత్ర చేసే వరకూ ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేని సమస్య కేవలం తెలంగాణలో మాత్రమే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. పొరుగున ఉన్న ఏపీలో ప్రభుత్వం, అధికారులు సమన్వయం చేసుకుంటున్నారని చెప్పారు. గన్నీ బ్యాగులు సరఫరా చేయలేని దురదృష్టకర పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉందని వీటిని ఓ ఆర్నెళ్ల ముందు వీటిని తెచ్చుకుంటే ఏం రోగం వచ్చిందని మండిపడ్డారు. ఇవాళ్టి వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కొనుగోలు కోటా పూర్తి కాలేదని అలాంటిది మమ్మల్ని విమర్శించే నైతిక బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కడిదన్నారు. ధాన్యం సేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ధాన్యం తీసుకోదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. చేతగాక కేంద్రంపై విమర్శలా అని ప్రశ్నించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన సన్నబియ్యం ఇతర రాష్ట్రాలకు అక్రమంగా సరఫరా చేస్తూ అక్కడి నుంచి నాసిరకమైన సన్ని బియ్యం దిగుమతి చేసుకుంటున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. వాటినే రేషన్ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. ఎవరి ఆశీస్సులతో ఇదంతా జరుగుతోందో తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న బియ్యంలో మోసం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమాషా అయిపోయిందని మాటకు ముందు కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడమే పనిగా మారిందన్నారు. వీళ్లు మాత్రమే నీతిగా పని చేస్తారనే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతు డిస్కం అంశం తన దృష్టికి రాలేదన్నారు. రబీ సీజన్‌కు సబ్సిడీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.



## ఊహాగానాలకు తావులేదు
# పార్టీ బలోపేతం, సమన్వయంపైనే చర్చించా

- వ్యక్తులపై ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు
- మీనాక్షి నటరాజన్‌తో భేటీపై జగ్గారెడ్డి క్లారిటీ

**వాస్తవదర్పణం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మే 30:** ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తో జరిగిన భేటీపై కాంగ్రెస్ సీనియర్ నేత టి. జగ్గారెడ్డి స్పష్టత ఇచ్చారు. దాదాపు 67 నెలల తర్వాత మర్యాదపూర్వకంగా కలిసిన ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని ఆయన పేర్కొన్నారు. తానే స్వయంగా అపాయింట్‌మెంట్ కోరగా సమయం ఇచ్చారని, సుమారు 10 నిమిషాల పాటు మాత్రమే భేటీ జరిగిందన్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరంపై చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు చేపడుతున్న కార్యక్రమాలకు అదనపు బలం చేకూర్చేలా పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించినట్లు వెల్లడించారు. తన భేటీపై మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ఎలాంటి ఆధారం లేదని, ఎవరిపైనా వ్యక్తిగత ఫిర్యాదులు చేయలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చర్చలు, భిన్నాభిప్రాయాలు సహజమని, వాటిని అతిగా అర్థం చేసుకోవద్దని మీడియాకు సూచించారు. ఇదిలా ఉంటే, జగ్గారెడ్డి-మీనాక్షి నటరాజన్ భేటీపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్న వేళ, స్వయంగా జగ్గారెడ్డి వివరణ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ అంతర్గత పరిణామాలు, భవిష్యత్ ఎన్నికల వ్యూహాల నేపథ్యంలో ఈ భేటీపై వచ్చిన ఊహాగానాలకు ఆయన చెక్ పెట్టే ప్రయత్నం చేసినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# రైతు డిస్కం పేరుతో రైతులను మోసగించే కుట్ర

- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



**వాస్తవదర్పణం, నంగునూరు, మే 30:** రైతు డిస్కం' పేరుతో వ్యవసాయానికి పగటిపూట ఏడు నుంచి ఎనిమిది గంటల కరెంటు ఇచ్చి రైతులను మోసం చేసే కుట్ర రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయిలో మాజీ మంత్రి హరీశ్ రావు శనివారం రాత్రి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. సమస్య వస్తే పావుగంటలో స్పందించిన బీఆర్ఎస్ పాలన ఎక్కడ.. రైతులను గాలికొదిలేసిన ఈ కాంగ్రెస్ పాలన ఎక్కడ అంటూ రైతుల ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల ఆవేదనను విన్న హరీశ్ రావు రైతులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండి పడ్డారు. నేలచూపులు చూస్తున్న భూముల ధరలతో.. పిల్లల ఫీజులు కూడా కట్టలేక రైతులు అల్లాడుతున్నారని హరీశ్ రావు వాపోయారు. "కాంగ్రెస్ సర్కార్ ఏగ్రేడ్ వడ్లను తీసేసింది, యూరియా కోసం తిప్పలు పెడుతోంది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న 'రైతు డిస్కం' వల్ల రైతుల ఉచిత విద్యుత్ కు ఉరితాడు పడబోతోంది. రైతు డిస్కంకు కేవలం సోలార్ పవర్ మాత్రమే కేటాయిస్తారు. అంటే పొద్దున సూర్యుడు వచ్చిన తర్వాతే మోటార్లు ఆన్ అవుతాయి, సాయంత్రం 5 గంటలకు ఎండ పోగానే మోటార్లు బంద్ అవుతాయి. దీనివల్ల రైతులకు కేవలం ఏడు నుంచి ఎనిమిది గంటల కరెంటు మాత్రమే వస్తుంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇక్కడి భూముల ధరలు ఎకరాకి రూ.50 లక్షలు పలికేది. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు పాతాళానికి పడిపోయాయి. రూ. 30 లక్షలకు ఇస్తామన్నా కొనే నాథుడు లేడు. తన కొడుకు పైలట్ చదువు ఫీజు కట్టడానికి భూమి అమ్ముకుందామంటే ఎవరూ కొనట్లేదని స్వయంగా మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేయడం ఈ ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోంది. రైతులను ఆదుకుంటామని గొప్పలు చెప్పిన ఈ ప్రభుత్వం.. రాగానే రైతు బంధుకు ఎగనామం పెట్టింది. చాలామందికి రైతుబంధు రాలేదు, కేవలం మూడు ఎకరాల వరకే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇంకోవైపు యూరియా దొరకక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.కేసీఆర్ పాలనలో రైతులు పండించిన పంటను ఏ రకమైన ఇబ్బంది లేకుండా కొనుగోలు చేశాం. నేడు కొనుగోలు కేంద్రాల్లో ఏగ్రేడ్ అనేది లేకుండా చేసి, తరుగు పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారు. పంట పండించడానికి ఒక కష్టం అయితే, పండిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ చిన్న సమస్య వచ్చినా.. ఒక్క మెసేజ్ పెడితే పావుగంటలో పరిష్కారం అయ్యేదని, ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడని రైతులు వాపోవడం బాధాకరం. ప్రభుత్వం రైతులను పట్టించుకోకున్నా, రైతుల ప్రతి రోజూ మీడియా వేదికగా నేను ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నాను. మీ సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రభుత్వం మెడలు వంచైనా సరే మీ పక్షాన నిలబడి కొట్లాడుతాను. భయపడకండి, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది" అని భరోసా కల్పించారు.



# ప్రభుత్వ కుట్రను అడ్డుకోండి

- సహకార సంఘాల్లో నామినేటెడ్ వ్యక్తులను నియమించేందుకు యత్నం
- గవర్నర్‌కు శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విజ్ఞప్తి

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మే 30:** రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా సహకార సంఘాల్లో నామినేటెడ్ వ్యక్తులను నియమించాలని చూస్తోందని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆరోపించారు. సింగిల్ విండో చైర్మన్లను కొనసాగించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ నేతలు కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు సహకార సంఘాల చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని, 2020లో గెలిచిన చైర్మన్లు 2025 వరకు పదవి కాలం ఉందని, ఆ తర్వాత వారిని కొనసాగించిందని తెలిపారు. ఎన్నికలు జరపకుండా వారికి అనుకూలంగా ఉన్న వారిని నామినేట్ చేయాలని చూస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరామని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్తామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

- సీఎస్ఆర్ నిధులను ప్రజా సంక్షేమానికి సమర్థవంతంగా వినియోగించాలి
- CSR నిధుల కేటాయింపు పై సంగారెడ్డి జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి దామోదర రాజనర్సింహ




**వాస్తవదర్పణం, సంగారెడ్డి ప్రతినిధి , మే 30 :** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రములు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి జిల్లాకు ఆయా పరిశ్రమల నుండి సి ఎస్ ఆర్ కింద ఎన్ని నిధులు వచ్చాయి,ఎంత ఖర్చు చేశాం, ఈ సంవత్సరం ప్రతిపాదనలు గురించి ఆరా తీశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు.

జిల్లాలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జిల్లాలోని ఆయా అవసరాలను గుర్తించి, కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రభుత్వ విద్యా సంస్థల్లో వాష్ రూమ్స్ , కాంపౌండ్ వాల్స్ , కిచెన్ షెడ్స్, డైనింగ్ హాల్,డార్మెంటరీ , బెడ్స్, అదనపు క్లాస్‌రూమ్‌ల నిర్మాణం, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతగా వినియోగించాలని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రతిపాదిత పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.

సీఎస్ఆర్ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి వారికి పలు సూచనలు చేసారు. ప్రజా ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# రెండో గెలుపే రాజకీయ భవిష్యత్‌కు పునాది

- ఎమ్మెల్యే మైనంపల్లికి జగ్గారెడ్డి కీలక సూచనలు

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మే 30:** హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ , సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అనుకోకుండా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయ పరిస్థితులు, రాబోయే ఎన్నికలు, యువ నాయకుల భవిష్యత్‌పై ఆసక్తికర చర్చ జరిగింది. ఎమ్మెల్యే రోహిత్‌ను ఉద్దేశించి జగ్గారెడ్డి పలు కీలక సూచనలు చేశారు. మొదటిసారి సాధించిన విజయాన్ని మర్చిపోవాలి. రెండోసారి గెలవడమే రాజకీయాల్లో నిజమైన పరీక్ష. రెండోసారి విజయం సాధిస్తేనే నాయకుడిగా స్థిరపడతారు అని వ్యాఖ్యానించారు. అలాగే, రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే ఎన్నికను కూడా తొలి ఎన్నికగానే భావించి, అదే కసి, పట్టుదలతో ప్రజల్లో పని చేయాలని రోహిత్‌కు సూచించారు. రెండో గెలుపే రాజకీయ జీవితానికి పెద్ద బ్రేక్. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పని చేయాలి అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మధ్య జరిగిన ఈ సంభాషణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.




# విత్తనాల కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండండి

- రైతులకు రాష్ట్ర పోలీసుల హెచ్చరిక
- పలు కీలక సూచనలతో పోస్టర్ విడుదల

**వాస్తవదర్పణం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మే 30:** సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాల కొనుగోలులో అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పోలీసులు సూచించారు. నకిలీ, కల్తీ విత్తనాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా తెలంగాణ పోలీస్ అధికారిక ఖాతా ద్వారా రైతులకు పలు కీలక సూచనలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు, అలాగే కల్తీ వ్యాపారుల ఆటకట్టించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పోలీసులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎవరైనా అమాయక రైతులను మోసం చేస్తూ కల్తీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠినమైన 'పీడీ యాక్ట్' నమోదు చేస్తామని హెచ్చరించారు. కల్తీ విత్తనాల విషయంలో రైతులు, ప్రజలు అస్సలు ఉదాసీనంగా ఉండకూడదన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు విడిగా (లూజుగా) అమ్మే విత్తనాలను కొనుగోలు చేయవద్దనీ నకిలీల భరతం పట్టడంలో, వారిని పట్టుకోవడంలో ప్రజలు కూడా పోలీసులతో భాగస్వాములు కావాలన్నారు. రైతుల జీవితాలతో చెలగాటమాడుతూ కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు, తద్వారా నష్టాల బారిన పడకుండా జాగ్రత్తపడాలని అవగాహన కల్పించారు.

వాస్తవ దర్పణం
తెలుగు దిన పత్రిక



## ఎస్ఐఆర్, బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశం

- ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**వాస్తవ దర్పణం, ఏఎస్ రావు నగర్:** డాక్టర్ ఎ.ఎస్. రావు నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ బిల్డింగ్ రౌండ్ బిల్డింగ్ లో నిర్వహించిన ఎస్ఐఆర్ అలాగే బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, పెద్దాపురం కుమార స్వామి, బేతాళ బాలరాజు, షేర్ మణమ్మ, మురళి పంతులు, శిరీష, సింగారపు మనమ్మ సత్తమ్మ, గొల్ల పద్మ, రమేష్ చారి, ఎస్కే రహీం, మాట్ల గిరి, ఓట్ల మొగిలయ్య, మొగులయ్య, కే కృష్ణ, ఎంపీ దాసు, సాయి రెడ్డి, రత్నాల కనకయ్య, ఎన్ రమేష్, నాగపురి రాజు, మల్లేష్, గోవర్ధన్ చారి, ఆనంద్ చారి, ఈ భాస్కర్, సింగారపు రాజు, శివదేవచారి, ఓట్ల యాదగిరి, పంతులు నరసింహ, పాషా, మన్సూర్, సాంబశివరెడ్డి, సత్యనారాయణ గౌడ్, సత్యనారాయణ, మల్లికార్జున, బాలయ్య, సరిత, మాలతి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభించిన చైర్‌పర్సన్

**వాస్తవ దర్పణం, భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా డిఆర్ డిఏ సెర్ప్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం (జెండర్ రిసోర్స్ సెంటర్ ) జీఆర్సీ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహ హింస, ఆరోగ్యం, పోషకాహారంపై ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మండల్ స్థాయి సోషల్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుందని, బాధితులు నేరుగా వచ్చి సేవలు పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యాసిన్, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో దినకర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రసాల శిరీష, కార్యదర్శి ఏదునూరి వాణి, కోశాధికారి కవిత, ఏపీఎం పాశికంటి మల్లేశం, సీసీలు అఫ్సర్, అలివేలు, మల్లేష్, కవిత, అకౌంటెంట్ పుష్ప, GRC సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు చొక్కా కుమారి, తిరుమల, సత్యలక్ష్మి, అంజమ్మ, మౌనిక, కవిత పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

**వాస్తవ దర్పణం, జడ్చర్ల:** హరిజనవాడ మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ చీరలను నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు వంశీచారి, సుంకసారి రమేష్, గుండు వెంకటేష్, బుచ్చిలింగం, శగంటి రఘు సుంకసారికురుమూర్తి, ఖాజా, అమర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు,

## హమాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దాసరి పాండు



**వాస్తవ దర్పణం, భువనగిరి, మే 30:** సిఐటియు ఆధ్వర్యంలో జనగాం జిల్లా కేంద్రంలో ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాలుగో మహాసభ గ్లోరీ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ మహాసభలో ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న దాసరి పాండు ను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా రైస్ మిల్ గోదాము మార్కెట్ గ్రామీణ హమాలీ రైల్వే తదితర హమాలీ కార్మికులుగా పనిచేస్తున్న హమాలి కార్మికుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నాయని హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అనేక పోరాటాలు నిర్వహిస్తున్న చేయాలని అనేక పోరాటాలు నిర్వహిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేవని అనేక రకాలుగా పనిచేస్తున్న హమాలి కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలి రేట్లు ఇవ్వడం లేదని కార్మిక చట్టాలైన ఈఎస్ఐ పిఎఫ్ పెన్షన్ సౌకర్యం కల్పించకపోగా యాజమాన్యాలు అనేక సందర్భాల్లో ఆక్సిడెంట్లు జరిగిన పట్టించుకోకపోవడంతో హమాలి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని వారు అన్నారు.

## డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకి అపార్ట్మెంట్ వాసుల వినతి

**వాస్తవ దర్పణం, మల్లాపూర్:** మల్లాపూర్ డివిజన్ పరిధి ఎన్ ఎఫ్ సి నగర్ కాలనీలోని సుప్రబాత్ రెసిడెన్సీ, సాయిప్రియం, శ్రీనివాసం మరియు రేణుక నిలయం అపార్ట్మెంట్ వాసులు డ్రైనేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదురుకుంటున్న నేపథ్యంలో వారి విన్నపం మేరకు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జలమండలి డిజియం వేణుగోపాల్, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని అపార్ట్మెంట్ వాసుల ఎమ్మెల్యేకి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని జలమండలి డిజియంని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, శ్రీనివాస్ దేవ్, శశిధర్ రెడ్డి, వెంకటేశ్వర రావు, అరవింద్ రెడ్డి, సుదర్శన్ తదితరులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు






## భూగర్భడ్రైనేజీ పైప్లైన్ పనులను పరిశీలించిన నాగశేషు, విఠల్ నాయక్

**వాస్తవ దర్పణం కాప్రా:** ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగ శేషు మాట్లాడుతూ కాప్రా డివిజన్లోని రెడ్డి కాలనీ ప్రధాన సమస్య భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ(యుజిడి) సమస్యను కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మరియు డివిజన్ అధ్యక్షులు అయిన నా దృష్టికి తీసుకురావడంతో, ఈ సమస్యను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డికి వివరించి వారి ద్వారా 42 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన స్వల్పకాల వ్యాధిలో కాప్రా డివిజన్ అభివృద్ధి బాట పట్టింది అన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మందముల పరమేశ్వర్ రెడ్డికి, స్వర్ణరాజ్ శివమణికి ధన్యవాదాలు తెలిపారు అన్నారు. మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ రెడ్డి కాలనీలో 42లక్షలతో ప్రారంభమైన యుజిడి పైప్ లైన్ అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగిందన్నారు. డివిజన్ అభివృద్ధికి మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కాప్రా డివిజన్ అభివృద్ధికై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నారని, డివిజన్లో కాప్రా చెరువు అభివృద్ధికి 35కోట్ల నిధులు మంజూరు, ఫుడ్బాల్ స్టేడియాలకు 13 కోట్లు, ఎల్లారెడ్డి గూడాకాప్రా ప్రధాన రహదారి వెంబడి బాక్స్ డ్రైన్ వంటి భారీ అభివృద్ధి పనులు, డివిజన్లో మౌలిక వసతుల కల్పనకు మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని ప్రోత్సహిస్తూ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ కాలనీ సమస్యను పరిష్కరిస్తున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ మందుముల పరమేశ్వర్ రెడ్డికి, స్వర్ణరాజ్ శివమణికు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరుళి, మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, తోటకూర శ్రీకాంత్, కొబరినోరి నాగరాజు, జగదీష్ గౌడ్, రియాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



**వాస్తవ దర్పణం, సిటీ బ్యూరో:** ఆదివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ గరిక సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కే. కేశవరావు (కే.కే.) మరియు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీతో ప్రత్యేక సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ 33 జిల్లాల నుంచి ఉద్యమ నాయకులు కమిటీలు జిల్లా కమిటీ నియోజకవర్గ కమిటీలు మండల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కన్వీనర్ దుమ్మటి కిరణ్, ఏరువా అశోక్, బండ వినేష్, ఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



AISO తెలంగాణ ఉపాధ్యక్షుడు ఎం.డి. సమీర్ వివాహం

## ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడికి ఆహ్వానం

వాస్తవదర్పణం, వనపర్తి జిల్లా: ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (AISO) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. సమీర్ తన వివాహానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు డా.ప్రొఫెసర్ ఎస్ కె మహ్మద్ గారిని ఆహ్వానించారు. ఈ వివాహ వేడుక జూన్ 4, 2026న వనపర్తి జిల్లా ఆత్మకూరులో జరగనుంది. విద్యార్థి నాయకత్వం మరియు ఉన్నత విద్యా వ్యవస్థల మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ ఆహ్వానం, పరస్పర గౌరవం మరియు సహకారానికి సంకేతంగా నిలుస్తోంది. AISO తెలంగాణ నాయకత్వం, డా. ప్రొఫెసర్ ఎస్ కె మహ్మద్ గారి హాజరు విద్యార్థి సమాజానికి ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొంది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ రమేష్ నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు వీరారెడ్డి, గడ్డం ఆదిత్య, ధనుంజయ, సాయికృష్ణ , శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ లో కుక్కలు తరలించాలని వినతి

**వాస్తవ దర్పణం, భువనగిరి:** భువనగిరి మున్సిపాలిటీ లో కుక్కలు కోతులను నివారణ చేపట్టి పట్టణ ప్రజల ప్రాణాలు కాపాడాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భువనగిరి పట్టణం లో నిత్యం ప్రజలు కుక్కలు మరియు కోతుల బారినపడి ఇటివల తారకరామ నగర్ లో ఒక బాబు కన్ను కోల్పోవడం జరిగిందని, రెండు రోజుల క్రితం హౌసింగ్ బోర్డు లో కుక్కలు కురవడం తో చిన్న బాబు తీవ్ర గాయాల పాలు కావడం జరిగిందని అయినా కూడా మున్సిపల్ పాలకవర్గం మరియు అధికారులు మొద్దు నిద్ర నటిస్తూ ఎమర్జెన్సీ కానీ వాటికి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయడం కానీ నిజంగా అత్యవసరం ఉన్న వాటికి చర్చించకపోవడం చాలా బాధాకరంగా ఉందని అన్నారు. విషయం ఈ మధ్యలో సుప్రీం కోర్టు కూడా వీధి కుక్కల మీద ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని అయినప్పటికీ భువనగిరి పట్టణంలోని 35వార్డు లలో కుక్కలను మరియు కోతులను వెంటనే పట్టాలని లేనియెడల మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. భువనగిరి పట్టణంలో మెప్మా విభాగంలో భారీ అవినీతి జరిగిందని చాలా రోజులుగా ఆరోపణలు వస్తున్న మున్సిపల్ కార్యాలయం నుండి ఈరోజు వరకు కూడా ఎంత అవినీతి జరిగిందో పేపర్ ప్రకటన కానీ అవినీతి చేసిన అధికారుల మీద ఆర్పీల మీద ఎలాంటి చర్యలు తీసుకుంటే పట్టణ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రజలకు తెలియజేయలేదు మీరు వెంటనే అవినీతి చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని లేనియెడలో బిఆర్ఎస్ పార్టీ తరఫున రానున్న రోజులలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్, నగేష్, కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, తాడూరి బిక్షపతి, ఖాజాముద్దీన్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాల్వరీ బాప్టిస్ట్ చర్చ్ ప్రారంభోత్సవం

- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షా ద్ ఖాన్

**వాసవ దర్పణం, ఉప్పల్:** ఉప్పల్ నియోజకవర్గం లోని బీరప్పగడ్డ డివిజన్, శ్రీనగర్ కాలనీలో పాస్టర్ మనోహర్ తమ స్వంత భవనంలో నిర్మించిన కాల్వరీ బాప్టిస్ట్ చర్చ్ శనివారం అత్యంత వైభవంగా ప్రారంభించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రాంతానికి చెందిన పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘ పెద్దలు, చర్చి నాయకులు, విశ్వాసులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం పాస్టర్ మనోహర్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కూడా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, ప్రార్థనా మందిరాలు సమాజంలో ప్రేమ, శాంతి, సోదరభావం మరియు మానవతా విలువలను పెంపొందించే పవిత్ర కేంద్రాలు. కాల్వరీ బాప్టిస్ట్ చర్చ్ ఈ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తూ సమాజ సేవలో ముందుండాలని కోరుకుంటున్నాను. మత సామరస్యం మరియు ఐక్యతే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. అలాగే పాస్టర్ మనోహర్ మరియు వారి కుటుంబ సభ్యులను అభినందిస్తూ, చర్చ్ నిర్మాణం ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. దేవుని ఆశీర్వాదాలతో ఈ చర్చ్ మరింత అభివృద్ధి చెంది ప్రజలకు సేవ చేసే ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన క్రైస్తవ సంఘ పెద్దలకు, పాస్టర్లకు, విశ్వాసులకు మరియు క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్ మనోహర్, వారి కుటుంబ సభ్యులు మరియు కాల్వరీ బాప్టిస్ట్ చర్చ్ సభ్యులందరికీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు.





# రోజ్‌వాటర్ ఎలా ఉపయోగిస్తున్నారు?



రంగురంగుల గులాబీలను చూస్తే మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. అయితే, సౌందర్య పరిరక్షణలోనూ రోజర్ వాటర్ పాత్ర ఎంతో ఉందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గులాబీ రేకులను నీటిలో మరిగించి ఆవిరి చేయడం ద్వారా తయారయ్యే ఈ సహజ ద్రవంలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. ఇది చర్మంపై చికాకును తగ్గించడం నుంచి జుట్టుకు పోషణ అందించడం వరకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందని తెలియజేస్తున్నారు. మరి, అదేలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

## టోనర్‌గా

గులాబీలో ఉండే సమతుల్య గుణాలు దీనిని ఒక అద్భుతమైన టోనర్‌గా మారుస్తాయి. ఇది చర్మం pH స్థాయిని క్రమబద్ధీకరించడానికి, రంధ్రాలను బిగుతుగా చేయడానికి, వాపును తగ్గించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రోజ్‌లో విటమిన్లు, ముఖ్యంగా విటమిన్ సి తో పాటు ఫినోలిక్ సమ్మేళనాలు, కెరోటినాయిడ్లు, టోకోఫెరోల్, బయోఫ్లేవనాయిడ్లు, టానిన్లు, అస్థిర నూనెల, పెక్టిన్‌లను సమృద్ధిగా కలిగి ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు.

## ఫేస్ మిస్ట్

రోజ్ వాటర్ చర్మానికి తక్షణమే తాజాదనాన్ని, ఉత్తేజాన్ని ఇస్తుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా చర్మ సమతుల్యతను కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు.

## క్లెన్సర్‌గానూ

రోజ్‌వాటర్ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుందట. ఇది మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుందని నిపుణులు చెబుతున్నారు. గులాబీ రేకుల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయంటున్నారు. ఈ క్రమంలో స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుందట.

## నల్లటి వలయాలు

కళ్ల కింద నల్లటి వలయాల్ని తగ్గించుకోవడానికి రోజ్ వాటర్‌ను ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొద్దిగా రోజ్‌వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్ల కింద మృదువుగా మర్దన చేయాలంటున్నారు. ఇలా వారానికి రెండు లేదా మూడు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుందట. అలాగే, ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయట.

## హెయిర్ రిన్స్

రోజ్‌వాటర్‌లో తేమను అందించే గుణాలు జుట్టుకు మంచి కండిషనర్‌లా పనిచేస్తుదంటున్నారు నిపుణులు. ఇది మాడుపై దురదను తగ్గించడానికి, చుండ్రును అరికట్టడానికి, జుట్టుకు మెరుపును ఇవ్వడానికి సహాయపడుతుందని చెబుతున్నారు.

## జుట్టు ఆరోగ్యంగా

రోజ్‌వాటర్‌లో ఉండే సహజసిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయట. ఈ క్రమంలో జుట్టు కోసం వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్కల రోజ్‌వాటర్ కలుపుకొంటే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి, 1015 నిమిషాల తర్వాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందట.

## సహజమైన మేకప్ రిమూవర్‌గా

రోజ్‌వాటర్ చాలా సున్నితమైనది. చర్మానికి ఎటువంటి హాని చేయదు. కాబట్టి, ఇది ఒక ప్రభావవంతమైన మేకప్ రిమూవర్‌గా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. ఒక కాటన్ ప్యాడ్‌ను రోజ్ వాటర్‌లో ముంచి, ముఖంపై మెల్లగా తుడుస్తూ మేకప్‌ను సులభంగా తొలగించవచ్చట.





### ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై

# సంతకం చేయని ట్రంప్!

**వాస్తవదర్పణం, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియా లో యుద్ధ సంక్షోభం ఇప్పుడప్పుడే ముగిసేలా కనబడటం లేదు. ఇరాన్‌తో కాల్పుల విరమణ పొడిగింపు, హర్మూజ్ జలసంధిలో దిగ్బంధనం ఎత్తివేతకు సంబంధించిన తాత్కాలిక ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయలేదు. దాంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది. ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యువేషన్ రూమ్‌లో ట్రంప్ తన సలహాదారులతో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వారు సమావేశమయ్యారు. అయినప్పటికీ ఒప్పందంపై ఎలాంటి పురోగతి లేదు. ఈ డీల్‌పై సంతకం చేయకుండానే ట్రంప్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామాలపై వైట్ హౌస్ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా అది అమెరికా కు మేలు చేసేదిగా ఉండాలని, టెహ్రాన్‌పై విధించే ఆంక్షలు, నిబంధనలపై ట్రంప్ సంతృప్తి చెందాలని అన్నారు. ఆ తర్వాతే అధ్యక్షుడు డీల్‌పై సంతకం చేస్తారని ఈ సందర్భంగా ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని పేర్కొన్నారు. మరోవైపు డీల్ విషయంపై అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. ఇంకా తుది ఒప్పందం ఖరారు కాలేదన్నారు.

### ఆరుగురు పిల్లలుంటే

# ఓటు హక్కు కట్!

- యూపీలో ఈసీ సొంత నిబంధనలు

**వాస్తవదర్పణం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మే 30:** ఆరుగురు అంతకన్నా ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్న పౌరుల ఓటు హక్కును తొలగించ వచ్చా? అంటే తొలగించవచ్చుననే అంటున్నారు యూపీలోని ఎన్నికల అధికారులు. మీకు ఆరుగురు పిల్లలున్నారా అంటూ ఈసీ ఈ ఏడాది జనవరి 6న వారణాసి కంటోన్మెంట్ పరిధిలోని సోనుగిరీ (35) కి నోటీస్ పంపింది. అతను అవునని సమాధానం ఇవ్వడంతో తుది జాబితాలో అతని పేరును తొలగించారు. ఇలాంటి కారణంతో నియోజకవర్గంలోని 20 బూత్‌ల పరిధిలో వేలాది మంది పేర్లను తొలగించినట్టు నేషనల్ హెరాల్డ్ తన అధ్యయనంలో పేర్కొంది. ఇలా తొలగించిన ఓటర్లను 'క్యూ' కేటగిరీలో చేర్చారు. అలాగే తాతయ్య, అమ్మమ్మల వయసుకు, ఓటరు వయసుకు మధ్య 40 ఏండ్ల కన్నా తక్కువ తేడా ఉన్నా, ఓటరుకు, వారి తల్లిదండ్రుల మధ్య 15 ఏండ్ల లోపు వ్యత్యాసం ఉంటే ఆ వ్యక్తి ఓటును తొలగించారు. యూపీ మాజీ ప్రధాన ఎన్నికల అధికారి నూర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన సర్ ప్రక్రియ అనుమానాస్పదంగా ఉన్నదని, అర్థం లేని కారణాలు చూపి వేలాది మంది ఓట్లను తొలగించినట్టు కనిపిస్తున్నదని, దీనిని తిరిగి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



# సునామీలా.. ఇసుక తుఫాను..

- రాజస్థాన్‌లో 100 అడుగుల ఎత్తులో బీభత్సం

**వాస్తవదర్పణం, నేషనల్ బ్యూరో, జైపూర్, మే 30 :** ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌లో ఇసుక తుఫాన్ బీభత్సం సృష్టించింది. చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ ప్రాంతాల్లో 100 అడుగుల ఎత్తులో ఇసుక తుఫాన్ చెలరేగింది. శనివారం మధ్యాహ్నం ఈ తుఫాన్ చెలరేగడంతో పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. రోడ్లన్నీ కనిపించకుండా పోయి రాకపోకలు నిలిచిపోయాయి.సముద్రంలో సునామీ వస్తే ఏ స్థాయిలో అలలు ఎగసిపడుతాయో.. ఇసుక తుఫాన్ దృశ్యాలు అలాగే అగుపించాయి. ఈ తఫాను అత్యంత భయంకరమైన వాతావరణాన్ని సృష్టించింది ఈ తుఫాన్. దీని దెబ్బకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుఫాన్ తర్వాత ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.




# షాక్‌కు గురవ్వాల్సిన అవసరం లేదు

- సీజేపీపై ఆర్ఎస్ఎస్ తొలి స్పందన

**వాస్తవదర్పణం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మే 30:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చుట్టూ పెరుగుతున్న దుమారంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తొలిసారి స్పందించింది. ప్రజా చర్చలు, భిన్నమైన అభిప్రాయాలు ప్రజాస్వామ్య సమాజంలో సర్వసాధారణమని, వాటికి దిగ్భ్రాంతి చెందకూడదని ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు సునీల్ అంబేకర్ శనివారం వ్యాఖ్యానించారు. మన దేశ ప్రజాస్వామ్యం విస్తృత శ్రేణి అభిప్రాయాలు, దృక్కోణాలతో మిలితమై ఉన్నదన్నారు. మనది చైతన్యవంతమైన సమాజం. పజాస్వామ్యంలో ప్రజలు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడాన్ని అయినా ఆశ్చర్యంగా భావించకూడదని నేను నమ్ముతున్నాను. కాబట్టి వాటిని సాధారణ ప్రక్రియలో భాగంగా పరిగణించాలి అని అంబేకర్ చెప్పుకొచ్చారు.



# సీఎల్పీ నేతగా శివకుమార్ ఎన్నిక

**వాస్తవదర్పణం, నేషనల్ బ్యూరో, బెంగుళూరు, మే 30 :** అంతా అనుకున్నట్టే కర్ణాటక కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆయన ఎన్నిక జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా.. హోం మంత్రి పరమేశ్వర బలపరిచారు. దీనికి మిగతా ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. జూన్ 3వ తేదీన డీకే శివకుమార్ కర్ణాటక నూతన సీఎంగా లోక్ భవన్ లోని గ్లాస్ హౌస్ లో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ మేరకు గవర్నర్‌ను కలిసి తనను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాలని కోరనున్నారు. శివకుమార్ రెండేండ్ల పాటు సీఎం పదవిలో కొనసాగనున్నారు.

# ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలేని 'విశ్వగురువు'

- మోదీపై రాహుల్ విమర్శలు



దేశ విద్యావ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ పూర్తిగా నాశనం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం తీవ్ర విమర్శలు చేశారు. ఒకవైపు దేశాన్ని విశ్వగురువుగా చెప్పుకుంటున్న మోదీ సర్కార్, కనీసం ఒక్క పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతోందని ఆయన ఆరోపించారు. అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం భారతదేశ వ్యాప్తంగా 'సీయూఈటీయూజీ 2026 పరీక్ష' నిర్వహించారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొన్ని కేంద్రాల్లో పరీక్ష ఆలస్యమైందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ, ప్రధాని మోదీని ఉద్దేశించి ఎక్స్ వేదికగా ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంతకు ముందు కూడా రాహుల్ గాంధీ, ప్రధాని మోదీని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. సీబీఎస్ఈ వివాదంపై పీఎం మోదీ మౌనం వహించడం, విద్యాశాఖమంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే, ఆయనకు కేవలం తన ప్రభుత్వ మనుగడపైనే శ్రద్ధ ఉందని, లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తుపై లేదని రాహుల్ విమర్శించారు. అంతేకాదు నీట్ పేపర్ లీక్‌పై ఆందోళన చేపట్టిన విద్యార్థులతో, తాను జరిపిన సంభాషణకు సంబంధించిన ఒక వీడియోను కూడా రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ కావడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శనివారం కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశ విద్యావ్యవస్థ మాఫియా గుప్పిట్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. నీట్ పరీక్ష పత్రాలను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లేందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సహాయం తీసుకోనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారణాలు తెలుసుకునే ఉద్దేశం కేంద్రానికి లేదని, దానికి బదులుగా ఇలాంటి వింతైన పనులకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఎక్స్ వేదికగా హిందీలో ఓ పోస్టు పెట్టిన కేజ్రీవాల్, మోదీ సర్కార్‌పై సెటైర్లు వేశారు. అయితే దీనిని సరిదిద్దడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఏదో ఒకటి చేయాలని కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. ఒక్కరుగా ఎవరూ ఏమీ చేయలేరని, అందరూ కలిస్తే ఏదైనా సాధ్యమేనని ఆయన అన్నారు. అదే సమయంలో దేశానికి చదువుకున్న ప్రధానమంత్రి అవసరం ఎంతైనా ఉందని, మోదీపై తనదైన స్టైల్‌లో సెటైర్ వేశారు. కాగా, ఇంతకు ముందు నీట్ యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించేందుకు కమిటీ ఉన్నా నీట్ పేపర్ ఎలా లీకైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నీట్‌కు సన్నద్ధం కావటానికి యువత కష్టపడుతుందని, వారిని ఇలా నిరాశకు గురిచేయటం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఎన్‌టీఏను రద్దు, పరీక్ష నిర్వహణలో మార్పులు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేస్తూ సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం

- దావూద్ నెట్‌వర్క్, ISI ముఠాకు చెందిన 9 మంది అరెస్ట్
- భారీ ఉగ్రకుట్రను భగ్నం చేసిన ఢిల్లీ పోలీసులు- ఐఎస్ఐతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 9 మందిని అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు
- వీరికి మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంతోనూ సంబంధాలు ఉన్నట్లు గుర్తింపు

ఢిల్లీ పోలీసులు శనివారం భారీ ఉగ్రకుట్నను భగ్నం చేశారు. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం నెట్‌వర్క్, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో సంబంధమున్న 9 మందిని అరెస్టు చేశారు. ఆ ముష్కరుల నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, హ్యాండ్ గ్రెనేట్లు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీరు దేశ రాజధానిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, రక్షణ స్థావరాలతో సహా ప్రముఖ మతపరమైన ప్రదేశాలపై ఉగ్రదాడులు చేయడానికి కుట్ర పన్నినట్లు గుర్తించారు.

**దేశరాజధానిలో ఉగ్రదాడులకు ప్లాన్**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడులు చేయాలనే లక్ష్యంలో ఐఎస్ఐ ఇదంతా చేసింది. ఈ ఉగ్రవాదుల ముఠా (మాడ్యూల్)ను చాలా కాలంగా అత్యంత పకడ్బందీగా పెంచి పోషించింది. కాగా ఈ నెట్‌వర్క్‌లో భాగమైన ముష్కరుల్లో నేపాల్‌కు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ప్రాథమిక దర్యాప్తులో అరెస్టు అయిన ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతున్న హ్యాండర్లతో, అలాగే ముంబయి అండర్‌వరల్డ్ డాన్‌గా పేరొందిన దావూద్ ఇబ్రహీంతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఢిల్లీలోని అత్యంత కీలకమైన భద్రతా స్థావరాలు, రక్షణ సిబ్బంది, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేయాలని వీరికి నిర్దేశించినట్లు తెలిసింది. అయితే నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ పకడ్బందీగా ఆపరేషన్ నిర్వహించి ఉగ్రవాదుల మాడ్యూల్ నుంచి అత్యాధునిక ఆయుధాలు, పేలుడు పదార్థాలు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకుంది. దేశ రాజధానికి ఉన్న తక్షణ ముప్పును విజయవంతంగా నివారించగలిగింది.

**ఉగ్రవాదులకు నిధులు ఎలా వస్తున్నాయ్?**

ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఈ ఉగ్రముఠాకు నిధులు (ఫండింగ్ ఛానల్స్) ఎలా వస్తున్నాయ్? వాళ్ల రిక్రూట్‌మెంట్ పద్ధతులు, వాళ్లకు అందిన రవాణాసహాయక నెట్‌వర్క్‌పై దర్యాప్తు ప్రారంభించింది. అంతేకాదు ఈ ఉగ్రకుట్రలో పాల్గొన్న హ్యాండ్లర్లు ఎవరు? స్థానికుల సహకారం ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

**దావుద్ అనుచరుడి అరెస్టు**

ఇదిలా ఉండగా, సరిగ్గా నెల రోజుల క్రితం పరారీలో ఉన్న అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు మహ్మద్ సలీం డోలాను తుర్కియే నుంచి భారతదేశానికి తీసుకురావడం జరిగింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఈ విధంగా డికంపెనీ నెట్‌వర్క్‌పై ఒక పెద్ద విజయాన్ని సాధించింది. 2020 నుంచి పరారీలో ఉన్న డోలాను, ఇస్తాంబుల్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నార్కోటిక్స్ క్రైమ్స్ డివిజన్, ఇస్తాంబుల్‌లోని బెయిలిక్‌దుజు జిల్లాలో అదుపులోకి తీసుకుంది. తర్వాత అతనిని భారత్‌కు అప్పగించి దేశ బహిష్కరణ ప్రక్రియను పూర్తిచేసింది. కాగా ఎన్‌సీబీ డోలాను భారత్‌కు తీసుకువచ్చి, ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టింది. దీనితో న్యాయస్థానం ఎన్‌డీపీఎస్ చట్టం కింద, ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు ఉన్న డోలాను ముంబయికి తరలించేందుకు ఎన్‌సీబీకి రెండు రోజుల ట్రాన్సిట్ రిమాండ్ మంజూరు చేసింది. ఇంతకు ముందు, ముంబయిలోని కుర్లా ప్రాంతంలో పట్టుబడిన దావూద్ అనుచరులు, తాము డోలా నుంచి ఆదేశాలు తీసుకున్నట్లు అంగీకరించారు. దీనితో ఈ హైప్రొఫైల్ అరెస్టు జరిగింది. ఆ సమయంలో వారి నుంచి 126 కిలోల కంటే ఎక్కువగా మెఫెడ్రోన్ డ్రగ్స్, రూ.25,22,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.





దావూద్ అంతర్జాతీయ డ్రగ్స్ సామ్రాజ్యాన్ని శాసించే కీలక వ్యక్తిగా పరిగణిస్తున్న డోలానును కస్టడీలోకి తీసుకుంది. అతనిని విచారణ చేస్తే, డీకంపెనీ పశ్చిమాసియా, ఐరోపా మీదుగా సరిహద్దులు దాటించి నిషేధిత పదార్థాలను ఎలా రవాణా చేస్తుంది? డ్రగ్స్ అమ్మగా వచ్చిన డబ్బులు తిరిగి వ్యవస్థీకృత నేరాల వైపు ఎలా మళ్లిస్తున్నారు? అందుకు వాడే హవాలా మార్గాలు ఏమిటి? అనేది తెలిసే వీలుంది. అంతేకాదు ముంబయి తదితర రాష్ట్రాల్లో పాక్ ఐఎస్ఐ, దావూద్ ఇబ్రహీం ముఠాల కోసం పనిచేసే యాక్టివ్ స్లీపర్ సెల్స్, డిస్ట్రిబ్యూటర్ల వివరాలు కూడా తెలిసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.



# రెండో టీ20లో చిత్తైన భారత్.. సిరీస్ సమం!

మహిళల పొట్టి ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టుకు ఇంగ్లండ్ షాకిచ్చింది. తొలి టీ20లో విజయంతో జోరుమీదున్న టీమిండియాను రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు చిత్తు చేసింది. ఫ్రేయా కెంప్(39 నాటౌట్), అమీ జోన్స్(28) రాణించగా భారత్‌కు 169 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన ఇంగ్లండ్ పరుగులతో గెలుపొంది సిరీస్ సమం చేసింది. మంధాన(32), యస్తికా భాటియా(33) పోరాడినా మిగతా వాళ్లు చేతులెత్తేయడంతో హర్మన్‌ప్రీత్ సేన మ్యాచ్ చేజార్చుకుంది. ఇంగ్లండ్ గడ్డపై విజయంతో ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను ఆరంభించిన భారత జట్టు రెండో మ్యాచ్‌లో తేలిపోయింది. ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలమైన టీమిండియా.. 169 పరుగుల లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. భారీ ఛేదనలో ఓపెనర్లు షఫాలీ వర్మ(22), స్మృతి మంధాన(32)లు దూకుడుగా ఆడినా ఇంగ్లండ్ బౌలర్లు వికెట్ల వేటతో పరుగులు వేగాన్ని అడ్డుకున్నారు. డేంజరస్ షఫాలీని లారెన్ బెల్ పెవిలియన్ పంపగా.. యస్తికా భాటియా(33), మంధాన పవర్ ప్లేలో స్కోర్ 40 దాటించారు. అనంతరం ఫ్రేయా కెంప్ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన మంధాన చివరి బంతికి సిక్సర్ కొట్టబోయి క్యాప్సే చేతికి చిక్కింది. దాంతో రెండో వికెట్ 43 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మంధాన ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(28) బిగ్ షాట్లతో అలరించింది. ఈ క్రమంలోనే టీ20ల్లో నాలుగు వేల పరుగులు పూర్తి చేసుకుంది. యస్తిక రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్ చేరగా.. జెమీమా రోడ్రిగ్స్(1), దీప్తి శర్మ(2)లు విఫలమయ్యారు. అరుంధతి రెడ్డి(4 నాటౌట్), శ్రేయాంక పాటిల్(6)లు సైతం ఇలా వచ్చి అలా వెళ్లడంతో భారత్ 9 వికెట్ల నష్టానికి 142 పరుగులే చేసింది. ఫలితంగా 26 పరుగుల తేడాతో గెలిచి సిరీస్ సమం చేసింది. నిర్ణయాత్మక మూడో టీ20 జూన్ 2న జరుగనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 21 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. తొలి అంతర్జాతీయ టీ20 ఆడుతున్న నందిని శర్మ(136) ఓవర్లో సోఫీయా డంక్లే(10) వికెట్ కీపర్ రీచా ఘోష్ చేతికి చిక్కింది. ఆ తర్వాత డానీ వ్యాట్(29), అమీ జోన్స్ (28) భారత బౌలర్లను ఉతికేస్తూ స్కోర్ బోర్డును ఉరికించారు. వ్యాట్ ఔటయ్యాక.. అలిసే క్యాప్సే(28), హీథర్ నైట్ (18)లు మిడిల్ ఓవర్లలో చెలరేగగా.. డెత్ ఓవర్లలో ఫ్రేయా కెంప్(39 నాటౌట్), డానియెల్లే గిబ్సన్ (11 నాటౌట్) దంచేశారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో, ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 168 పరుగులు చేయగలిగింది.

## సెమీ ఫైనల్లో ఓడిన వినేశ్ ఫొగాట్



పారిస్ ఒలింపిక్స్ అనంతరం రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికి.. ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలనుకున్న వినేశ్ ఫొగాట్ కల చెదిరింది. భారత రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడి, కోర్టు అనుమతితో ట్రయల్స్‌లో పాల్గొన్న ఆమె అనూహ్యంగా ఓటమి పాలైంది. మహిళల 53 కిలోల విభాగంలో పోటీపడి తొలి రెండు రౌండ్లలో గెలుపొందిన ఆమె కీలకమైన సెమీ ఫైనల్లో విఫలమైంది. మీనాక్షి గోయత్ చేతిలో 46తో పరాజయంతో ఆసియా క్రీడలకు దూరమైంది. ఈమధ్యే వీడ్కోలు నిర్ణయం వెనక్కి తీసుకున్న వినేశ్ ఫొగాట్‌కు ఆసియా క్రీడల ట్రయల్స్‌లో చుక్కెదురైంది. న్యూ ఢిల్లీలో శనివారం ఈ మెగా టోర్నీ కోసం జరిగిన రెజ్లర్ల ఎంపిక పోటీల్లో వినేశ్ ఓటమి పాలైంది. 50 కిలోల విభాగలో పోటీపడేందుకు రెజ్లింగ్ సమాఖ్య అనుమతించకపోవడంతో 53 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె తొలి పోరులో జ్యోతిని 71తో ఓడించింది. అదే ఉత్సాహంతో క్వార్టర్ ఫైనల్లో నిషిని 50తో చిత్తు చేసిన వినేశ్ జోరుకు మీనాక్షి గోయత్ చెక్ పెట్టింది. కానీ, సెమీఫైనల్లో ఉడుంపట్టుతో ఒలింపిక్ విజేతను రెండు పాయింట్ల(46) తేడాతో ఓడించింది మీనాక్షి. దాంతో, ఏడాది జపాన్‌లో జరుగనున్న ఆసియా క్రీడల్లో కుస్తీ పట్టాలనుకున్న వినేశ్‌కు నిరాశే మిగిలింది. సెమీస్‌లో ఓటమిపై స్పందించిన వినేశ్ 'నేను మళ్లీ వస్తాను' అని పేర్కొంది. వినేశ్ - నిషి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నాటకీయంగా సాగింది. తొలి మూడు నిమిషాల్లో 05తో వెనుకంజలో ఉన్న వినేశ్.. గొప్పగా పుంజుకొని నిషిని పడగొట్టింది. సరిగ్గా ఆ సమయంలోనే రిఫరీ విజిల్ వేసి.. నాలుగు పాయింట్లు కేటాయించాడు. అయితే.. అతడి నిర్ణయాన్ని వినేశ్ సవాల్ చేసి రివ్యూ గెలిచింది. ఆమె భర్త సోమ్‌వీర్ రథీ కూడా నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. చివరకు 76తో ఆసియా క్రీడలకు అర్హత సాధిస్తుందనుకున్న వినేశ్ ఆశలపై సెమీస్ ప్రత్యర్థి మీనాక్షి నీళ్లు చల్లింది. ఫైనల్లో మీనాక్షిని 32తో ఓడించిన అంతిమ్ పంగాల్ ఆసియా క్రీడల 53 కిలోల విభాగంలో ఎంపికైంది.

TATA IPL 2026

## ఫైనల్ మ్యాచ్

### గుజరాత్ X బెంగళూరు



# ఐపీఎల్ ఫైనల్ నేడే

**అహ్మదాబాద్:** నీరునిప్పు లాంటి భిన్న జట్ల మధ్య ఐపీఎల్ తుది పోరుకు వేదిక సిద్ధమైంది. టోర్నీ అంతటా భీకర దూకుడుతో ప్రత్యర్థులను భయపెట్టిన బెంగళూరు.. ప్రశాంతంగా, పక్కా ప్రణాళికలతో సాగిన గుజరాత్‌తో ఆదివారం ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే ఫైనల్లో తలపడనుంది. 17 ఏండ్ల పోరాటం తర్వాత గతేడాది నెగ్గిన ట్రోఫీని నిలబెట్టుకోవాలని ఆర్సీబీ పట్టుదలతో ఉండగా, 2022 విన్నర్ గుజరాత్ ఆ జట్టుకు బ్రేకులు వేయాలని చూస్తోంది. ప్రస్తుత ఫామ్ ప్రకారం ఆర్సీబీనే అందరి దృష్టిలో హాట్ ఫేవరెట్. వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ సరసన చేరాలని రజత్ పాటిదార్ నాయకత్వంలోని ఆర్సీబీ టార్గెట్‌గా పెట్టుకుంది. కానీ, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని జీటీని అంత తేలిగ్గా తీసిపారేయలేం. క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ చేతిలోనే చిత్తయినా.. రెండో క్వాలిఫయర్‌లో రాజస్థాన్‌పై అద్భుత విజయంతో ఫైనల్‌కు వచ్చింది. పైగా తమ హోమ్ గ్రౌండ్‌లో ఆట ఆ జట్టుకు అడ్వాంటేజ్ కానుంది. మరి, ఆఖరాటలో టైటాన్స్.. పాటిదార్ సేనను ఎలా అడ్డుకుంటుందో చూడాలి.

### భీకర బ్యాటింగ్.. కూల్ కెప్టెన్

ఈ సీజన్‌లో ఆర్సీబీ అత్యంత దూకుడుగా, రిస్క్‌తో కూడిన బ్యాటింగ్ శైలిని అవలంబించింది. పిచ్ స్వభావం, ప్రత్యర్థి బౌలింగ్ వ్యూహాలతో సంబంధం లేకుండా విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్, ఫిలిప్ సాల్ట్, వెంకటేశ్ అయ్యర్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఈ సీజన్‌లో ఆర్సీబీ ఏకంగా ఎనిమిదిసార్లు 200 ప్లస్ స్కోర్లు చేసింది. మరోవైపు కెప్టెన్ పాటిదార్ తన ప్రశాంతమైన నిర్ణయాలతో జట్టుకు అద్భుతమైన స్థిరత్వాన్ని అందించాడు. మాజీ కెప్టెన్లు కోహ్లీ, డుప్లెసిస్ అంత దూకుడుగా కనిపించకపోయినా, సీనియర్లను, యువ ఆటగాళ్లను సమన్వయం చేసుకుంటూ జట్టును విజయవంతంగా నడిపించాడు. బ్యాటింగ్‌తో పాటు ఆర్సీబీ బౌలింగ్ విభాగం కూడా పవర్‌ప్లే నుంచే ప్రత్యర్థులను కట్టడి చేస్తోంది. 26 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో రెండో స్థానంలో ఉన్న భువనేశ్వర్ పేస్ దాడికి నాయకత్వం వహిస్తున్నాడు. అతడికి తోడుగా హేజిల్‌వుడ్ (13 వికెట్లు), రసిఖ్ సలామ్ (16 వికెట్లు), కృనాల్ పాండ్యా (13 వికెట్లు) వైవిధ్యమైన బౌలింగ్‌తో రాణిస్తున్నారు. కృనాల్ బ్యాట్‌తోనూ జట్టుకు ఉపయోగకరమైన పరుగులు అందించాడు. అయితే గుజరాత్ టాపార్డర్‌ను ఆర్సీబీ బౌలర్లు ఏమేరకు కట్టడి చేస్తుందనేదే అత్యంత కీలకం కానుంది.

### టాపార్డర్, బౌలర్లపైనే జీటీ భారం..

ఈ సీజన్‌లో మిగతా జట్లు పవర్‌ప్లేలో ఓవర్‌కు 11 నుంచి 12 పరుగులు రాబడుతుంటే గుజరాత్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ 9 రన్‌రేట్‌తో సంప్రదాయ పద్ధతిలోనే ఇన్నింగ్స్ ఆరంభిస్తున్నారు. ఆ టీమ్ మిడిల్ ఆర్డర్ కాస్త బలహీనంగా ఉండటమే ఇందుకు కారణం. అందువల్ల టాప్ 3 బ్యాటర్లయిన గిల్, సుదర్శన్, జోస్ బట్లర్‌లపైనే భారీ భారం పడింది. గిల్ (163 స్ట్రయిక్ రేట్‌తో 722 రన్స్), సుదర్శన్ (159 స్ట్రయిక్ రేట్‌తో 710 రన్స్), బట్లర్ (157 స్ట్రయిక్ రేట్‌తో 507) ఈ సీజన్‌లో అత్యంత స్థిరంగా రాణించారు. ఆఖరి మ్యాచ్‌లోనూ ఈ ముగ్గురిపైనే జీటీ గంపెడాశలు పెట్టుకుంది. ఇక, ఈ సీజన్‌లో సొంత మైదానంలో ఆడిన 7 మ్యాచ్‌ల్లో 5 గెలవడం గుజరాత్‌కు సానుకూలాంశం. బౌలింగ్ విభాగంలో ఆర్సీబీపై టైటాన్స్‌కు స్వల్ప ఆధిక్యం ఉంది. ముఖ్యంగా అహ్మదాబాద్ పిచ్ ఏమాత్రం అనుకూలించినా జీటీ బౌలర్లు మరింత ప్రమాదకరంగా మారుతారు. 28 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో ఉన్న కగిసో రబాడ ఈ విభాగాన్ని నడిపిస్తున్నాడు. అతడికి తోడుగా మహ్మద్ సిరాజ్, రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్, ప్రసిధ్ కృష్ణ బౌలింగ్ భారాన్ని మోస్తున్నారు. ఈ సీజన్‌లో రబాడ, సిరాజ్ వరుసగా 165, 162 డాట్ బాల్స్ వేసి బ్యాటర్లను కట్టడి చేశారు. హార్డ్ లెంగ్త్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు పెద్ద షాట్లు ఆడే అవకాశం ఇవ్వకుండాఅడ్డుకుంటున్నారు. అయితే, సిరాజ్ ఫిట్‌నెస్ ఇప్పుడు కాస్త ఆందోళన కలిగిస్తోంది. రాజస్థాన్ రాయల్స్‌తో గత మ్యాచ్‌లో సిరాజ్ భుజం నొప్పితో ఇబ్బంది పడ్డాడు. తన 4 ఓవర్ల కోటాను పూర్తి చేసినప్పటికీ మైదానంలో అసౌకర్యంగా కనిపించాడు. ఫైనల్ మ్యాచ్‌లో సిరాజ్ లేకపోతే జీటీ బౌలింగ్ కాంబినేషన్ దెబ్బతినే చాన్సుంది.

### పిచ్/వాతావరణం

గత ఫైనల్‌కు ఉపయోగించిన పిచ్‌పై ఈ మెగా ఫైట్ జరగనుంది. ఈ రెండు జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌తో సహా ఈ సీజన్‌లో దీన్ని ఇప్పటికే రెండుసార్లు ఉపయోగించారు. అహ్మదాబాద్ వికెట్ సాధారణంగా ఛేజింగ్ చేసే జట్లకు అనుకూలంగా ఉంటుంది. గత ఆరు ఫైనల్స్‌లో నాలుగు ఛేజింగ్ చేసిన జట్లే గెలుచుకున్నాయి. అహ్మదాబాద్‌లో ఆదివారం వర్ష సూచన లేదు. మ్యాచ్‌కు అంతరాయం కలిగితే సోమవారం రిజర్వ్ డే ఉంది.



# ప్రేమ కాలం

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ పెళ్లి, బాబు పుట్టిన తర్వాత కాస్త హోమ్లీగా కనిపిస్తూ వచ్చింది. కానీ తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే! గ్లామర్ డోస్ పెంచి సరికొత్త బోహో-చిక్ లుక్‌లో నెటిజన్ల మైండ్ బ్లాక్ చేసింది. 'Le temps de l’amour' (ప్రేమ కాలం) అంటూ ఫ్రెంచ్ క్యాప్షన్‌తో కాజల్ వదిలిన ఈ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో కాజల్ అగర్వాల్ ఎవరూ ఊహించని రేంజ్‌లో స్టైలిష్‌గా కనిపించింది. ఆమె వైట్ కలర్ స్లీవ్‌లెస్ క్రోచెట్ ఓపెన్-నిట్ హాల్టర్ టాప్ ధరించింది. జియోమెట్రిక్ డిజైన్‌తో ఉన్న ఈ టాప్‌కు మ్యాచింగ్‌గా లైట్-వాష్ డిస్ట్రెస్డ్ డెనిమ్ షార్ట్స్ వేసుకుంది. ఈ మోడ్రన్ సమ్మర్ లుక్‌లో కాజల్ అందాలు నెటిజన్లకు అస్సలు నిద్రపట్టనివ్వడం లేదు.




# ‘శ్రీనివాస మంగాపురం’తో హీరోగా పరిచయం కావడం అదృష్టం

## హీరో జయకృష్ణ ఘట్టమనేని

‘ఆర్‌ఎక్స్ 100’, ‘మంగళవారం’ వంటి విభిన్న చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న క్రియేటివ్ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘శ్రీనివాస మంగాపురం’ హీరోగా పరిచయమౌతున్న జయకృష్ణ ఘట్టమనేని ఇప్పటికే తన స్టన్నింగ్ లుక్స్, ఆకట్టుకునే బేస్ వాయిస్‌తో మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడిగా, మహేష్‌బాబు అన్న కొడుకుగా భారీ అంచనాల మధ్య ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్నారు. విజువల్‌గా అద్భుతమైన, వైలెంట్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోంది. ఈ చిత్రంతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. లెజెండరీ నిర్మాత అశ్వినీ దత్ సమర్పణలో, జెమినీ కిరణ్ తన ‘చందమామ కథలు’ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ‘శ్రీనివాస మంగాపురం’ ఒక గ్రాండ్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా శ్రీను&మంగా పాత్రలని పరిచయం చేస్తూ గ్రాండ్ ఈవెంట్ నిర్వహించారు. శ్రీను & మంగా ఈవెంట్‌లో హీరో జయకృష్ణ ఘట్టమనేని మాట్లాడుతూ.. తాతయ్య కృష్ణ గారి పుట్టినరోజు సందర్భంగా మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది. తాతయ్య నాకు దేవుడితో సమానం. ఆయనపై నాకు ఉన్న అభిమానాన్ని మాటల్లో చెప్పలేను. ఆయన ఎక్కడ ఉన్నా తన ఆశీస్సులు నాతో ఉంటాయని నమ్ముతున్నాను. ‘శ్రీనివాస మంగాపురం’ నా తొలి చిత్రం. అజయ్ భూపతి ఈ కథ చెప్పినప్పుడు ఇందులో ఉన్న ఎమోషన్స్, నా పాత్రలోని డెప్త్ నన్ను చాలా ఆకట్టుకున్నాయి. ఈ క్యారెక్టర్ ద్వారా నన్ను నేను ఛాలెంజ్ చేసుకోవచ్చని, నటుడిగా నిరూపించుకునే అవకాశం దొరుకుతుందని భావించాను. నా తొలి సినిమాకే ఆయనలాంటి దర్శకుడు దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. దత్తు మా తాతగారితో ‘అగ్నిపర్వతం’, బాబాయ్ మహేష్ బాబుతో ‘రాజకుమారుడు’ చేశారు. ఇప్పుడు నన్ను హీరోగా పరిచయం చేస్తున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను. హీరో అవ్వాలనే ఆలోచనకు ప్రేరణ మా బంగారు తాతయ్య. ఆయన లేకపోతే నేను ఈరోజు ఇక్కడ ఉండేవాడిని కాదు. మోహన్ బాబు గారు, నరేష్ గారు వంటి లెజెండరీ నటులతో కలిసి నటించడం కూడా ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఈ సినిమాను మీరందరూ తప్పకుండా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను.”అన్నారు.

Printed and Published by Editor MD ZAKRIA, on behalf of QSS PUBLICATION(Owner: Abdul Sattar), Printed at New Bharath Printers, Main Road, Ramanthapur, Hyderabad-–13. Published at Indira Nagar, Ramanthapur, Hyderabad-–500013.Ph.9701485857 RNI NO : APTEL/2013/54511.